అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



అక్షింతలను అందజేస్తున్న శ్రీ శివాంజనేయస్వామి దేవాలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌టౌన్, జనవరి 17: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 19, 20, 21వ వార్డుల్లో గురువారం అయోధ్య రాముడి పూజిత అక్షింతలను పంపిణీ చేసినట్లు పటేల్‌రోడ్డు శ్రీ శివాంజనేయస్వామి దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 22 అయోధ్యలో జరుగనున్న విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఒక్కరూ దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సాయంత్రం సమయాల్లో తమ ఇంటి ముందు 5 దీపాలను వెలిగించాలన్నారు. కార్యక్రమంలో రమేశ్, అశోక్, ధనరాజ్, శ్రీధర్‌వర్మ, నర్సింగ్, జగదీశ్, శివ, నవీన్, విఠల్, శ్యామ్, అజయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజేత.. కుటుంబానికి సాయం

టోర్నమెంట్‌లో గెలుపొందిన నగదును అందజేస్తున్న సభ్యులు

మంచాల, జనవరి 17 : మంచాల మండలం లింగంపల్లి గ్రామంలో స్వర్గీయ డాక్టర్ అనిరెడ్డి శ్రీలక్ష్మి జ్ఞాపకార్థం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎల్‌పీఎల్ 2 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన జట్టు సభ్యులకు బీఆర్ఎస్ మండల నాయకుడు బత్తుల కిషన్‌రెడ్డి రూ.10 వేల నగదు, షీల్డ్‌ని బుధవారం అందజేశారు. ఆ నగదును నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు విష్ణు కుటుంబ సభ్యులకు వారు అందజేశారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, పద్మారెడ్డి, భిక్షపతి, కిషన్, శివ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ

చేవెళ్లటౌన్, జనవరి 17: తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే వీటీజీసీఎఫ్‌టీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ బి. జయమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 6న చివరి తేదీ కాగా, ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష 11వ తేదీ ఉదయం 11 గంటలకు ఉంటుందని చెప్పారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని తెలిపారు.

చెరువు శిఖం భూమిని కాపాడాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 17 : మండలంలోని తారామతిపేట పోల్కమ్మ చెరువు శిఖం భూమిని కబ్జాచేసి అక్రమంగా వేసిన రోడ్డును తొలగించాలని కోరుతూ మండల సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవీందర్‌దత్తుకు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ గతంలో పోల్కమ్మ చెరువు నుంచి రోడ్డు వేశారని ఆర్డీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కై చెరువు, కుంటలు కబ్జాకు గురవుతుంటే అధికారులు తూతూ మంత్రంగా కేసులు పెట్టి కబ్జాదారులకు సంబంధంలేనట్టుగా వ్యవరిస్తున్నారని వివరించారు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి పోల్కమ్మ చెరువు శిఖం భూమిలో రియల్ వ్యాపారులు వేసిన రోడ్డును తొలగించి చెరువును కాపాడాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు శివకుమార్, యాదయ్య, శివ ఉన్నారు.

22న శ్రీరామ చంద్రుల పాదుకాపట్టాభిషేకం

సైదాబాద్, జనవరి 17: సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని వేంకటేశ్వరాలయంలో 22వ తేదీన శ్రీరామ చంద్రుల పాదుకాపట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో బాలరాముడిని ప్రతిష్ఠిస్తున్న అమృతఘడియల్లో వేంకటేశ్వరస్వామి ఆలయంలోని సీతా రామచంద్రుల సమక్షంలో అంగ రంగ వైభవంగా పాదుక పట్టాభిషేకం నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా రామ జపం, రామ భజనలు సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరా కాలనీవాసులు, భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులు తమ పేర్లను ఈనెల 21వరకు 98495 69626, 98497 57708కు ఫోన్‌చేసి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

వనస్థలిపురం గణేశ్ టెంపుల్‌లో సుందరకాండ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సుందరకాండ హోమం

వనస్థలిపురం, జనవరి 17: వనస్థలిపురం శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో సుందరకాండ పారాయణ హోమం వైభవంగా జరుగుతున్నది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ జరిగే వరకు కొనసాగుతాయన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఒక్కరూ హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బి.అశోక్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ రామ్మోహన్, కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి లక్ష్మారావు, బాలేశ్వర్, సురేశ్, బ్రహ్మచారి పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేసుకోవాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మండల సర్వసభ్య సమావేశం
- సమస్యలను ప్రస్తావించిన ప్రజాప్రతినిధులు

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, జనవరి 17 : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ ప్రారంభంకాగానే ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి కొంతమంది అధికారులు సమయపాలన పాటించడం లేదని ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దెలకుంటతండా, జమ్ములబావితండా, రావిచేడ్, కడ్తాల్ గ్రామాల్లో మిషన్ భగీరథ గ్రిడ్ మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ పోతుగంటి శంకర్, ఎంపీటీసీలు గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి సభలో ప్రస్తావించగా... వారం, పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని డీఈఈ సందీప్ పేర్కొన్నారు. తమ పదవికాలం పూర్తి కావొస్తున్నా సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన సమస్యలు పరిష్కారం కావడంలేదని, విధుల నిర్వహణలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని వైస్ ఎంపీపీ ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వ్యవసాయానికి, గృహాలకు అప్రకటిత కరెంట్ కోతలు విధిస్తున్నారని పలువురు సర్పంచ్‌లు సభలో లేవనెత్తగా.. ప్రభుత్వం మారగానే మార్పు వచ్చిందని సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలో భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో రైతులకు రైతుబంధు పెట్టుబడి సాయం అందడంలేదని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ప్రశ్నించారు. ముద్విన్ గ్రామంలో రాత్రివేళల్లో ఇసుక మాఫియా వాగుల్లో నుంచి ఇసుకను లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారని సర్పంచ్ యాదయ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. వివిధ గ్రామాల పరిధిలోని సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. వారికి అధికారులు సమాధానం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలని, ఎన్నికలయ్యాక గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. గ్రామాల్లో కరెంట్ కోతలు లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వం హయాంలోనే 95 శాతం మిషన్ భగీరథ పనులు పూర్తయ్యాయని చెంచు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తవద్దని అధికారులకు సూచించారు. విధుల నిర్వహణలో అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. చరికొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి రూ.15 లక్షలు, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, మంజుల, ఉమావతి, నిర్మలమ్మ, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సులోచన, యాదయ్య, సుగుణ, భాగ్యమ్మ, రాములు, పాండు, సీఐ శివప్రసాద్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, ఎంఈవో సర్దార్‌నాయక్, పశువైద్యాధికారి భానునాయక్, ఎంపీవో మధుసూదనాచారి, ఏవో శ్రీలత, ఏఈలు పరమేశ్, నరేందర్, నిఖిల, శ్రావ్య, నోడల్ అధికారి జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కడ్తాల్, జనవరి 17 : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని గౌరుపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని గ్రామ సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ సరితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని వివరించారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకట్రామి రెడ్డి, శ్రీశైలం, రఘుపతి, ఎంపీటీసీలు సుధాకర్‌రెడ్డి, రమేశ్, ఉప సర్పంచ్ అంజయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాములు, నాయకులు నరేందర్‌గౌడ్, గణేశ్‌గుప్తా, యాదయ్య, లింగంగౌడ్, డేవిడ్, శంకర్‌నాయక్, ఆజీమ్, రవీందర్, ఆరీఫ్, చెన్నకేశవులు, పీఆర్ డీఈ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీకాంత్, ఏఈ విద్యాసాగర్, ఎంపీవో రఘు, ఏపీవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం, జనవరి17: విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా మండలంలోని సుల్తాన్‌పూర్ ఫీడర్‌లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిసరాల్లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నందున వాటిని తొలగించడంతో పాటు విద్యుత్ సరఫరాలో తరుచూ తలెత్తుతున్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించడం కోసం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుల్తాన్‌పూర్ ఫీడర్ పరిధిలో విద్యుత్‌ను నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఆర్టీఏ కార్యాలయం ప్రారంభం

ఇబ్రహీంపట్నం, జనవరి 17 : ఇబ్రహీంపట్నం ఆర్టీఏ కార్యాలయాన్ని గురువారం ఉదయం 10:30గంటలకు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం తెలిపారు. రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మన్నెగూడ సమీపంలో నిర్మించారు. రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖమంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, జనవరి 17: షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించడం కోసం ప్రతి నెల ఈ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా డయల్ యువర్ డీఎం ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. డయల్ యువర్ డీఎం సెల్ నంబర్ 9959226287 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీని కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

- గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మేళ్లగూడ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, జనవరి17 : షాద్‌నగర్ మున్సిపాలిటీని కలిసి మెలిసి అభివృద్ధి చేద్దామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. వివిధ వార్డుల కౌన్సిలర్లు వారి వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సెల్లార్లను అడ్డుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిపై దృష్టి సారించాలని కౌన్సిలర్లకు సూచించారు. డబుల్‌బెడ్రూంలు అర్హులందరికీ అందేలా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోలిపూర్‌లో డంపింగ్‌యార్డు సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్నబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మేళ్లగూడ గ్రామంలో నూతన జీపీ భవనం, నాగులపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళా భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఇప్పటికే ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, ఎంపీడీవో వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేసిన ప్రగతి చెరిపేసే కుట్ర

శిలాఫలకానికి అడ్డుగా పోసిన మట్టి, మరో శిలాఫలకంపై ఉన్న పేరుపై రంగురుద్దిన దృశ్యం

పెద్దఅంబర్‌పేట, జనవరి 17: అధికారంలో ఉండగా చేసిన అభివృద్ధి పనులను కనిపించకుండా చేసే కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ చెరుకూరి రేణుకాజగన్ ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధి 5వ వార్డులో గతంలో చేసిన అభివృద్ధి పనుల గుర్తింపును తెలిపే శిలాఫలకాలపై మట్టి పోసి, కూల్చివేస్తూ ప్రస్తుత కౌన్సిలర్ అవమానపరుస్తున్నారన్నారు. సత్యనగర్ కాలనీ వాసుల కోసం ఐదేండ్ల కిందటే సీసీ రోడ్డు వేయగా.. కేవలం కాంట్రాక్టు పనుల కోసం దాన్ని ధ్వంసం చేసి మళ్లీ కొత్త సీసీ రోడ్డు వేశారన్నారు. పాత శిలాఫలకంపై మట్టి పోసి కించపరిచారని ఆరోపించారు. సదాశివ కాలనీలోనూ గతంలో వేసిన సీసీ రోడ్డు శిలాఫలకంపై ఉన్న తమ పేరుపై రంగు రుద్ది అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తారా హోమ్స్‌లో వేసిన సీసీ రోడ్డును కొంత పగలగొట్టగా.. డీఈకి ఫిర్యాదు చేయడంతో ఆ పనులు విరమించుకున్నారన్నారు. ఓ కౌన్సిలర్ చేసిన పనులను గౌరవించకపోగా.. అవమానపరచడం సరికాదన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మొయినాబాద్, జనవరి 17: గ్రామానికి సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదానికి గురై మృత్యువాత పడే అవకాశముందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, జనవరి 17: నిరుపేదలను ఆదుకోవడమే రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ధ్యేయమని కడ్తాల్ జడ్పీటీసీ, ట్రస్టు చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుర్లకుంట తండాకి చెందిన పాత్లావత్ హున్ని మృతి చెందింది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి హున్ని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రాధాకృష్ణ ట్రస్టు తరుపున జడ్పీటీసీ రూ.5వేలు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.4వేలు, యువజన సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రాఘవేందర్ రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, లోకేశ్‌నాయక్, నర్సింహాగౌడ్, ఎంపీటీసీలు లచ్చిరాంనాయక్, గోపాల్, ప్రియ, నాయకులు వీరయ్య, హన్మానాయక్, రామచందర్‌నాయక్, నేజ్యానాయక్ పాల్గొన్నారు.

క్రీడలు యువత నైపుణ్యాన్ని పెంపొందిస్తాయి

యాచారం: విజేతలకు బహుమతులందజేస్తున్న సీఐ రామాంజనేయులు

మంచాల : బహుమతులందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

యాచారం, జనవరి17: క్రీడలు యువత నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐ రామాంజనేయులు అన్నారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఎంఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మంగళవారం రాత్రి బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి రన్‌చేజర్స్ జట్టుకు, ద్వితీయ బహుమతి ఫాంటర్స్ జట్టుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తే వారు క్రీడల్లో మరింత సత్తా చాటే అవకాశముందన్నారు. క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గ్రామాల్లో నిర్వహించే క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, స్పాన్సర్లు పాచ్చ భాష, ఆడాల గణేశ్, అచ్చిరెడ్డి, శ్రీశైలం, బుస్సు జంగారెడ్డి, జాల నాగరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

మంచాల : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సీపీఎం జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి శ్రీరామ్ యూత్, ద్వితీయ బహుమతి యువసేన క్రికెట్ క్లబ్ జట్టుకు బుధవారం అందజేశారు. అదేవిధంగా మండలంలోని లోయపల్లి గ్రామంలో కారింగు సావిత్రమ్మ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, బుగ్గ రాములు, నూకం రవి, బుచ్చయ్య, చీమర్ల గాలమ్మ, చిందం బీరప్ప, అంజయ్య, సత్తయ్య, బుగ్గయ్య, బీజేపీ నాయకులు కారింగు రాజు గౌడ్, జంగయ్యగౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

ఇబ్రహీంపట్నంరూరల్ : మండల పరిధిలోని దండుమైలారం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం బహుమతులను అందజేశారు.క్రీడల్లో రాణించే యువతకు తమవంతు సహకారం అందిస్తామని పలువురు అన్నారు. కార్యక్రమంలో జంగయ్య, నిట్టు నర్సింహ, లింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఆమనగల్లు, జనవరి 17 : ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఆమనగల్లు పట్టణంలో మెగా రక్తదాన శిబిరం, వైద్య శిబిరాన్ని నిర్వహించునున్నట్లు కేఎన్ఆర్ సేవా దళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో బీపీ, మధుమేహం, గుండె సంబంధిత ఈసీజీ, టుడికే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తదాన శిబిరంలో యవత పాల్గొనాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎంఈవో

వాలీబాల్ ను అందజేస్తున్న ఎంఈవో అక్బర్

శంకర్‌పల్లి, జనవరి 17 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో సయ్యద్ అక్బర్ అన్నారు. బుధవారం జన వాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20వ తేదీన మోకిల గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో జరిగే వాలీబాల్ టోర్నమెంట్‌ను మండలంలో గల 13 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.